క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వై.రామవరం: మండలంలోని దేవరమడుగులు గ్రామ ఫీడర్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ డీఈఈ బి.దివాకరరావు తెలిపారు. ఈ పరిధిలోని లైన్ల మరమ్మతులు, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న తుప్పలు తొలగింపు తదితర పనులు చేపడతామని ఈ కారణంగా దేవరమడుగులు ఫీడర్ పరిధిలోని పి.యర్రగొండ, పనసలపాలెం, చవిటిదిబ్బలు, దేవరమడుగులు, దాలిపాడు, కె.యర్రగొండ, కోట, యర్రంరెడ్డిపాలెం పంచాయతీల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి జాతీయ పశుగణన

గంగవరం: జాతీయ పశుగణన కార్యక్రమం ఈనెల 25 నుంచి జరుగుతుందని నెల్లిపూడి గ్రామీణ పశు వైద్యశాల జూనియర్ వెటర్నరీ అధికారి పరిశిక అప్పన్నబాబు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం దేశవ్యాప్తంగా ఐదేళ్లకొకసారి పశు జాతులను లెక్కిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం మూడు నెలల పాటు జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఎంపిక చేసిన సిబ్బంది గ్రామంలోని ప్రతీ ఇంటికి వచ్చి పశుగణన వివరాలు సేకరిస్తారని, సిబ్బందికి ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు.

పవనగిరి క్షేత్రంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న వెంకటరామయ్య పాల్గొన్న భక్తులు

అడ్డతీగల: పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య గురువులైన సదానంద సరస్వతీ స్వామిజీ 17 వ ఆరాధనోత్సవం గురువారం పవనగిరిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పవనగిరి క్షేత్రంలో విశేష పూజలు, హోమం జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ గావించారు.

రుణాల మంజూరుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

గంగవరం : మహిళా సంఘాలకు స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ రుణాల మంజూరుకు, పాత రుణాలు రికవరీకి వెలుగు సిబ్బంది తగిన కృషి చేయాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వెలుగు ఏపీఎం షణ్ముఖరావు ఆధ్వర్యంలో వెలుగు సిబ్బంది, మహిళా సంఘ సభ్యులతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రామకృష్ణ మాట్లాడారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి కొత్త అప్పులు మంజూరు, పాత అప్పులు రికవరీ గురించి, గ్రేడింగ్‌పై సిబ్బందికి వివరించారు. ఎస్‌బీఐ మేనేజర్ జగదీష్‌కుమార్, స్త్రీ నిధి మేనేజర్ ప్రవీణ్‌కుమార్, సీసీలు, మహిళా పోలీస్‌లు పాల్గొన్నారు.

సాగునీటి యాజమాన్య పద్ధతులపై అవగాహన

రంపచోడవరం: వరి సాగులో నీటి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు పీఎస్‌పీ కో–ఆర్డినేటర్ పులి కీర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్ట్‌నర్స్ ఇన్ ప్రాస్పిరిటీ(పీఎస్‌పీ), ప్రో క్లైమైట్ రైస్ కల్టివేషన్ ఫర్ రేడ్యుసింగ్ మీథేన్ ఎమిషన్స్ అండ్ సేవింగ్ వాటర్ ప్రాజెక్టు ద్వారా రైతులకు సేవలను అందిస్తున్నట్టు పేర్కొన్నారు. నీటి యాజమాన్య పద్ధతుల సాగుతో గ్రీన్ హౌస్ వాయువు ఉద్గారాలను తగ్గించడం ఈ ప్రాజెక్టు లక్ష్యమన్నారు. మెరుగైన నీటి నిర్వహణ పద్ధతులను అమలు చేయడం ద్వారా సంప్రదాయ, నిరంతర నీటి పారుదల పద్ధతికి బదులుగా ప్రత్యామ్నాయ పద్ధతులతో సాగు చేయవచ్చన్నారు. ఇందులో భాగంగా ఏలూరు జిల్లా యడవల్లి, తూర్పుగూడెం గ్రామంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి రైతులు హాజరు కావాలని కోరారు.

చదువులు సాగేదెలా?

- నెలలుగా లేని ఉపాధ్యాయుడు
- బడిబయట విద్యార్థులు
- ఆందోళనలో తల్లిదండ్రులు
- పట్టించుకోని అధికారులు



కొమ్ములవాడలో పాఠశాల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు

సీలేరు: ఏజెన్సీ మారుమూల ప్రాంతాల్లో ప్రాథమిక విద్య...ప్రస్తుతం మిథ్యగానే మారింది. గిరిజన విద్యార్థుల విద్యపై కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నామని గొప్పలు చెప్పడమే తప్ప ఆచరణకు నోచుకోవడం లేదు. మైదాన ప్రాంతాల విద్యార్థులపై చూపుతున్న శ్రద్ధ గిరిజన విద్యార్థులపై లేదని, నిర్లక్ష్యం చూపుతుందని గిరజనులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో పాఠశాల నిర్వహణ విద్యాశాఖ అధికారులు గాలికొదిలేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇచ్చింది. ఏజెన్సీలో ప్రతి ప్రాంతంలో పాఠశాలలకు కోట్లాది రూపాయలతో మౌలిక సదుపాయాలు కల్పించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏజెన్సీలో ప్రాథమిక విద్య అమలుపై కనీసం పట్టించుకోవడం లేదు. ఉపాధ్యాయులు లేని పాఠశాలలూ ఉన్న వారిని నియమించడంలో యంత్రాంగం, ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. ఫలితంగా గిరిజన విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దీంతో చిన్నారులు వెట్టిచాకిరికి గురువుతున్నారు. దినసరి కూలీ పనుల్లో చేరుతున్నారని పలువురు చెబుతున్నారు. బడిబయట పిల్లల సంఖ్యలో పెరుగుతోందని ఆందోళన చెందుతున్నారు.

గూడెం కొత్తవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ కొమ్ములవాడ గ్రామంలో కొద్ది నెలలుగా ఉపాధ్యాయుడిని నియమించకపోవడంతో ఆ పాఠశాలలో చదువుతున్న 38 మంది విద్యార్థుల చదువుకు దూరమయ్యారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గ్రామస్తులు ఆందోళన చేశారు. పలుమార్లు విద్యాశాఖాధికారులకు సమస్యను విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తమ పిల్లల భవిష్యత్ కోసం పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంఈవో ఎంఈఓ రామన్న మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లడంతో అప్పుడప్పుడు వేరే ఉపాధ్యాయుడిని పంపించేవారమని, నేటి నుంచి పూర్తి స్థాయిలో ఉపాధ్యాయుడిని నియమిస్తామన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని లైగండ పంచాయతీ పనసపుట్టు గ్రామంలో ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు విద్యకు దూరమవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. గత రెండు నెలలు నుంచి పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు పైచదువుల నిమిత్తం వెళ్లిపోవడంతో ఆ స్థానంలో మరో ఉపాధ్యాయుడిని నియమించాల్సి ఉన్నప్పటికీ భర్తీ చేయలేదని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యపై గతంలో అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికి పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. తమ పిల్లలు చదువులకు దూరమై బడిబయట ఉంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని కోరుతున్నారు.



పసనపుట్టులో ఉపాధ్యాయుడు లేక బడిబయట ఉన్న విద్యార్థులు

ఈ విషయాన్ని ఎంఈవో శెట్టి సుందర్‌రావు వద్ద ప్రస్తావించగా పనసపుట్టులో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు పై చదువులపై సెలవులలో ఉన్న మాట వాస్తవమే అయితే అతని స్థానంలో మరో ఉపాధ్యాయుడిని ఐటీడీఏ నియమించకపోవడంతో తాత్కలికంగా ఎంపీపీఎస్ లైగండ పాఠశాల నుంచి సీఆర్‌టీని నియమించినట్టు చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆశ్రమ విద్యార్థి ఎంపిక



వంతాల శివాజీ

పెదబయలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్–14 బాలుర విభాగంలో రాష్ట్రస్థాయి ఖోఖో జట్టులోకి పెదబయలు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల–2 విద్యార్థి ఎంపికైనట్టు హెచ్‌ఎం చెట్టి కృష్ణమూర్తి చెప్పారు. ఈ నెల 22న అనకాపల్లి జిల్లా లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పెదబయలు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వంతాల శివాజీ ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి ఖోఖో జట్టుకు ఎంపికవడంతో ఆనందంగా ఉందన్నారు. ఇదే పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టులోకి 9వ తరగతి చదువుతున్న కిల్లో చిరుత ఎంపికై నట్టు తెలిపారు. మా పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయా విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు కోచ్‌గా వ్యవహరిస్తున్న ఫిజికల్ డైరెక్టర్ కోటేశ్వరరావును అభినందించారు. రాష్ట్ర స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలువాలని ఆకాంక్షించారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారి జన్ని జగత్‌రాయ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు



మర్రిపాలెంలో మాట్లాడుతున్న ఎంపీపీ కృష్ణారెడ్డి

గంగవరం: మండలంలోని మర్రిపాలెం, ఎల్లాపురం గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ కృష్ణారెడ్డి ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చున్నారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది వ్యవసాయ సాగులో ఇచ్చే సలహాలు, సూచనలు, పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలన్నారు. గురువారం మర్రిపాలెం, ఎల్లాపురం గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వరి క్షేత్రాలను ఎంపీపీ, సర్పంచ్‌లు, రైతులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయపరమైన సలహాలను సిబ్బంది ద్వారా తెలుసుకోవాలన్నారు. కషాయాల తయారీ, తక్కువ పెట్టుబడితో నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించవచ్చునని ఎంపీపీ రైతులకు సూచించారు. మండల వ్యవసాయాధికారి కె.విశ్వనాథ్ మాట్లాడుతూ రైతులకు అందుతున్న సేవలు గురించి వ్యవసాయ అనుబంధ శాఖలు అందించే సేవలను రైతులకు వివరించారు. వ్యవసాయ సాగులో చేపటాల్సిన సస్యరక్షణ చర్యలు, ఎరువుల వాడకం, ప్రకృతి వ్యవసాయ సాగు విధానం, ఉపయోగాలను వివరించారు. రైతుల సమస్యలపై రైతులతో చర్చించారు. మర్రిపాలెం, ఎండపల్లి సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు దొర, రామలక్ష్మి, వ్యవసాయ, అనుబంధ శాఖల సిబ్బంది రాజు, ఉష,అనిల్, పంచాయతీ కార్యదర్శి శివగణేష్ రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చింతకర్రపాలెంలో వైద్య శిబిరం



గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

వై.రామవరం: మండలంలోని చింతకర్రపాలెం గ్రామంలో గురువారం చవిటిదిబ్బలు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరం ఆ గ్రామంలోని 98 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందించారు. మండలంలో 'విజృంభిస్తున్న విషజ్వరాలు' శీర్షికన ఈనెల 23న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్ నరేంద్ర, దినేష్‌లు మాట్లాడుతూ మండలంలో జ్వరాలు ఎక్కువగా ఉన్న సమస్యాత్మక గ్రామాలన్నింటిలోను శిబిరాలు నిర్వహిస్తామన్నారు. శిబిరంలో చవిటిదిబ్బలు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యతో సతమతం



రైల్వే గేటు వద్ద నిలిచిపోయిన వాహనాలు

డుంబ్రిగుడ: మండలంలోని రైల్వే క్రాసింగ్ గేటు వద్ద తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇక్కడ రోజూ రైలు వచ్చి, వెళ్లిన తరువాత రెండు వైపులా ఉన్న గేట్‌లలో ఒకటి సాంకేతిక సమస్య వల్ల సక్రమంగా తెరచుకోవడం లేదు. విజయనగరం–భద్రాచలం జాతీయ రహదారిలో ఉన్న రైల్వే ట్రాక్‌లో ప్రస్తుతం ఫ్లైఓవర్ నిర్మాణం జరగకపోవడంతో అనునిత్యం ఈ మార్గంలో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక్కడున్న రైల్వే క్రాసింగ్ పాయింట్ వద్ద ఉన్న రెండు గేట్‌లలో ఒకటి సక్రమంగా పనిచేస్తుంది. రెండవది పనిచేయడం లేదు. రైలు ఈ క్రాసింగ్ దాటిన తరువాత ఒక గేటు తెరుచుకోగా, రెండవ గేట్‌ను అక్కడున్న సిబ్బంది వెళ్లి ఎత్తవలసి వస్తుంది. ఈ కారణంగా తరచూ ట్రాఫిక్ స్తంభించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయంలో అనుకోకుండా ఏదైనా రైలు వస్తే ఘోర ప్రమాదం జరుగుతుందోని తక్షణమే రైల్వే ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

తాగునీటి బోరు పనులకు భూమిపూజ



బోరు పనులకు శంకుస్థాపన చేస్తున్న వైస్‌ఎంపీపీ సత్యనారాయణ, నేతలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో స్థానిక ఇంజినీరింగ్ కార్యాలయం సమీపంలోని కాలనీలో జెడ్పీ నిధులతో నూతన బోరు నిర్మాణ పనులకు గురువారం వైస్ ఎంపీపీ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరబీరు జగబంధులు శంకుస్థాపన చేసి, భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జగబందు మాట్లాడుతూ జెడ్పీ నిధలు రూ.1.40లక్షలతో బోరు వేయనున్నట్టు చెప్పారు. గ్రామంలో ఉన్న నీటి సమస్యను స్థానికులు గతంలో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర దృష్టికి తీసకువచ్చారని గుర్తు చేశారు. దీనిపై ఆమె స్పందించి బోరు ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్రకు ప్రత్యేక కృతజ్ఞతలు కాలనీ వాసులు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సన్యాసిరావు, తిరుపతిరావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఎటపాక: మండలంలోని వలస ఆదివాసీ గ్రామాల్లో కృప గాస్పల్ చర్చి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గురువారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాలుగు మండలాల పాస్టర్ పీటర్ సింగయ్య చేతుల మీదుగా కొండరెడ్లకు 500 దుప్పట్లు, 2వేల చీరలు, ఇతర దుస్తులు అందజేశారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. పాస్టర్లు భీమయ్య,దివ్య కుమార్, గాబ్రియేల్, జాన్‌పాల్, తరుణ్ పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ దృష్టికి సమస్యలు



జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పిటీసీ సభ్యురాలు రోషిణి, ఎంపీపీ ఉషారాణి

అరకులోయ రూరల్: ప్రజాప్రతినిధుల సమస్యలపై విశాఖ ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రకు అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల జెడ్పిటీసీ సభ్యులు శెట్టి రోషిణి, జానకమ్మ, గంగరాజు, ఎంపీపీలు ఉషారాణి, ఈశ్వరిలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. విశాఖపట్నంలో ఆమె కార్యాలయంలో వారు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను వివరించారు. ఇందులో భాగంగా ఎంపీటీసీ సభ్యుల పెండింగ్‌లో ఉన్న రెండు సంవత్సరాలు గౌరవ వేతనం చెల్లించాలని, గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పనకు అవసరమైన నిధులు మంజురు చేయాలని, పీవీటీజీలకు ప్రధాన మంత్రి యోజన పథకం ద్వారా నిర్మాణం చేసడుతున్న గృహలకు ఇస్తున్న నిధులను రూ.5లక్షలు పెంచాలని కోరనట్టు వారు చెప్పారు. ప్రధానంగా గ్రామాల్లో మౌలిక సదుపాయలు తాగునీరు, సీసీరోడ్లు, డ్రైనేజీలు వంటి పనులు నిర్వహించేందుకు అవసరమైన నిధులు మంజురు చేయాలని వినతిలో పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన వారిలో వైస్ ఎంపీపీ రామన్న, నాయకులు అశోక్‌కుమార్, నర్సింహమూర్తి, రామ్మూర్తి తదితరులున్నారు.

ఆత్మీయ వీడ్కోలు



పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు

కొయ్యూరు: మండలంలోని బూదరాళ్ల పంచాయతీ నుంచి మైదాన ప్రాంతానికి బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను గురువారం వంతమర్రిలో సిబ్బంది, గ్రామస్తులు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న బూదరాళ్ల సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు వంతల కుమారి తదితరులు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన శ్రీనివాస్ స్థానికులకు అందించిన సేవలు మరువలేనివన్నారు. కొత్తగా పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన కె.లీలాకృష్ణను కూడా సన్మానించారు. వైస్సార్‌సీపీ నాయకులు నారాయణ, తిరుపతి రావు, శ్రీను, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం : ఇద్దరి అరెస్టు



గంజాయి నిందితులతో పోలీసులు

మోతుగూడెం: విజయవాడకు గంజాయి అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు మోతుగూడెం ఎస్‌ఐ కె.శివనారాయణ తెలిపారు. మోతుగూడెం పోలీస్‌స్టేషన్ ఎదురుగా చెక్‌పోస్టు వద్ద గురువారం నిర్వహించిన తనిఖీల్లో 2 కిలోల గంజాయిని తరలిస్తున్న షేక్ రిజ్వాన్, కూరగంటి సుభాష్‌లను అరెస్టు చేసినట్టు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ. 10 వేలు ఉంటుందన్నారు.వీరి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్టు చెప్పారు. గంజాయి అక్రమ రవాణాలో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులు విజయవాడకు చెందిన వారని తెలిపారు.

పెంచిన ధరలను తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కిల్లో సురేంద్ర

పెదబయలు: ప్రధాని మోదీ దేశ వ్యాప్తంగా జమిలి ఎన్నికల పేరుతో ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్నారని, దీనికి సీపీఎం పూర్తిగా వ్యతిరేకమని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర అన్నారు. పెదబయలులో పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని సామాన్య ప్రజలు బతుకు ఇబ్బందిగా ఉందని ప్రజలపై కేంద్ర ప్రభుత్వం భారం మోపిందన్నారు. పెరిగిన ధరలు నియంత్రించాలని నవంబర్ 8 నుంచి 15 తేదీ వరకు దేశ వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు, రాస్తారోకోలు నిర్వహించాలని పిలుపునిచ్చామన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో వచ్చినప్పటి నుంచి దళితులు గిరిజనులు, మైనారీలు వెనుకబడిన తరగతులు మహిళలపై అత్యాచారాలు, హింసా పెరిగిందన్నారు. వీటికి అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అలాగే గిరిజన ప్రాంతంలో జీవో నంబర్–3 రద్దు చేసిందని దీంతో వేలాది మంది గిరిజనులు ఉపాధి అవకాశాలు, రిజర్వేన్లు కోల్పోవడం జరిగిందన్నారు. వెంటనే జీవో నంబర్–3ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈనెల 29న పెదబయలులో పార్టీ మహాసభ జరుగుతుందని, గిరిజనులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు అన్యాయం చేస్తుందన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి చిన్నయ్యపడాల్, మండల కార్యదర్శి బొండా సన్నిబాబు, గంగాధరం, శరభన్న, బుజ్జిబాబు, దర్మన్న పడాల్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు మరచిన కూటమి ప్రభుత్వం

వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్‌రావు విమర్శ



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ ఆనందరావు, పక్కన వైఎస్సార్‌సీపీ నాయకులు

డుంబ్రిగుడ: కూటమి ప్రభుత్వం ఎన్నిల ప్రచారంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలుచేస్తామని హామీ ఇచ్చి నేటికి ఐదు నెలలు కావస్తున్నా ఒక్క పథకం కూడా అమలు చేయలేదని, ప్రజలకు మోసం చేసిందని వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్‌రావు అన్నారు. మండల కేంద్రంలో ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రకటించిన నవరత్నల పథకాలే కాకుండా అన్ని వర్గాల ప్రజలకు అనేక పథకాల ద్వారా ఆదుకున్న జగన్‌మోహన్‌రెడ్డిని గిరిజన ప్రజానీకం నిరాజనాలు పలికారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలనలో ఎక్కడ చూసినా హింసలు, హత్యలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. నాయకులు, బాకా సింహచలం, పి.ఆశోక్‌కుమార్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు అగతమ్మిడి గణపతి పాల్గొన్నారు.

రియల్ దందాకు అడ్డుకట్ట వేయాలి



తహసీల్దార్‌ని కలిసిన గిరిజన నేతలు

ఎటపాక: ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా మండలంలో జరుగుతున్న రియల్ దందాకు అడ్డుకట్ట వేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ సుబ్బారావుని వారు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండలంలోని జరుగుతున్న భూఆక్రమణల విషయాలను వివరించారు. గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా గిరిజనేతరులు భూఆక్రమణలు చేసి నిర్మాణాలు చేపడుతున్నారని, దీన్ని అడ్డుకోవాలని కోరారు. ఏజెన్సీ చట్టాలకు అనుగుణంగా పీసా గ్రామసభల తీర్మాణాల ప్రకారం పంచాయతీల్లో పనులు జరిగేలా చూడాలన్నారు. తహసీల్దార్ సుబ్బారావును కలిసిన వారిలో పూనెం చినవీరభద్రం, రాఘవయ్య, లక్ష్మణరావు, దుర్గారెడ్డి, నరసింహారావు తదితరులున్నారు.

లక్ష్యంతో చదివితే ఉత్తమ ఫలితాలు



హాజరైన విద్యార్థులు



రంపచోడవరంలో మాట్లాడుతున్న సీఐ రవికుమార్

రంపచోడవరం: వ్యసనాల బారిన పడకుండా బాగా చదువుకుని ఉన్నతులుగా ఎదగాలని రంపచోడవరం సీఐ రవికుమార్ అన్నారు. పోలీస్ అమరవీరు వారోత్సవాల్లో భాగంగా సీఐ రవికుమార్, ఎస్‌ఐ సాధిక్‌ల ఆధ్వర్యంలో గురువారం రంపచోడవరంలోని బాలుర గురుకుల పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. సీఐ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి లక్ష్యాలను నిర్దేశించిన అందుకనుగుణంగ కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. క్రమశిక్షణతో ప్రణాళికబద్ధంగా చదవాలని సూచించారు. మంచి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఎస్‌ఐ సాధిక్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి క్రమశిక్షణతో మెలిగితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరకుంటారన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ అలీషా మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటున్నారన్నా. వివిధ స్థాయిల పోటీల్లో పాఠశాల విద్యార్థులు ఎంపికై ఉత్తమ ప్రతిభ కనబర్చినట్టు చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ మోపిదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

డుంబ్రిగుడ: మండలంలోకి కిల్లోగుడ గిరిజన బాలుర ఆశ్రమ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అరకులోయ సీఐ హిమగిరి బుధవారం సందర్శించారు. విద్యార్థులకు కేరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. డ్రగ్స్ వల్ల జీవితాలు నాశనమవుతాయన్నారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలను వివరించారు. దీనిపై గ్రామస్తులకు విద్యార్థులు తెలియజేయాలన్నారు.



కిల్లోగుడలో విద్యార్థులతో మాట్లాడుతున్న అరకులోయ సీఐ హిమగిరి